క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మాఘమాసం దానికి తోడు స్వామివారికి ప్రీతి పాత్రమైన సోమవారం కావడంతో బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారు జామున జరిగే తొలి అభిషేకం, పూజలను తిలకించారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజను నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర్శర్మ, అల్లికి రాజగోపాల్శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం పేద పిల్లలకు ఉచితంగా సీట్లు ఇవ్వాల్సి ఉందని ఎంఈఓ వై శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆ చిన్నారులను ఒకటో తరగతిలో చేర్చడానికి మార్చి 5 నుంచి 25 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల లోపు ఉండాలన్నారు. దరఖాస్తు సమయంలో తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, విద్యార్థి పుట్టిన తేదీ పత్రం, ఫొటోలను ఆన్లైన్లో పంపాల్సి ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన లాటరీ పద్ధతిలో తొలి జాబితా విడుదల చేస్తామన్నారు. రెండో జాబితా కోసం ఏప్రిల్ 2 నుంచి 15వ తేదీ వరకు విద్యార్థుల అడ్మిషన్లు ఫైనల్ చేసి 15వ తేదిన లాటరీ ద్వారా రెండవ జాబితాను ప్రకటిస్తామన్నారు. ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ప్రైవేటు విద్యా సంస్థలు ఆయా అడ్మిషన్లను ఖరారు చేసి విద్యాశాఖ అధికారులకు పంపుతారన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

కొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు సైనికుల్లా పనిచేయాలని వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు సూచించారు. మండలంలోని కొండెవరంలో సోమవారం జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి గాది గంగబాబు అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ జెడ్పీటీసీ వెంగళి సుబ్బారావు, ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు గాది బాబ్జీ, ఇంటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని గోర్స గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు అన్నారు. మండలంలోని గోర్స గ్రామంలో గౌడ, పద్మశాలీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు అందించిన రూ.5 లక్షలతో ఈ కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు, పంచాయతీ నిధులతో రూ.5 లక్షలతో అభివృద్ధి చేపట్టినట్టు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెప్సిబాకు సేవా ఆరోగ్య మిత్ర పురస్కారం



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న గోర్స హెప్సిబా

కాకినాడ సిటీ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో నిరంతరం వైద్యం కోసం వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఆరోగ్యమిత్రగా అందించిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం సేవా ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని ఆగస్టు నెలకు గోర్స హెప్సిబాకు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం అందించారు. ఈమె మాధవపట్నం సూర్య గ్లోబల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ఆరోగ్యమిత్రగా ఆమె పని చేస్తున్నారు. కలెక్టరేట్లో ఆమెకు ప్రశంసా పత్రం, రూ.5 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ మేనేజర్ కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సలామ్

- ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామ వలంటీర్లు
- సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరిస్తున్న ప్రభుత్వం
- మండలంలో 561 మందికి అవార్డులు



అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ వంగా గీత (ఫైల్)

కొత్తపల్లి: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో గ్రామ వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తున్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం గత 4 సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందించిన వారిని అవార్డులు, సత్కారాలతో ప్రోత్సహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానంగా పనిచేస్తున్న వలంటీర్లకు పనితీరు ఆధారంగా నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, బ్యాడ్జీలు, మెడల్స్ను అందిస్తోంది. మండలంలోని 25 గ్రామ సచివాలయాల పరిధిలో 561 మంది వలంటీర్లకు గాను ఈ ఏడాది ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, మిలిగిన వారు సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారు.

ప్రజాసేవతో సంతృప్తి



గత రెండు సంవత్సరాలుగా సేవా వజ్ర అవార్డును పొందాను. ఈ ఏడాది కూడా సేవ రత్న అవార్డు దక్కడం ఆనందంగా ఉంది. మాలాంటి నిరుద్యోగులను జగనన్న గ్రామ వలంటీర్లుగా నియమించడమే కాకుండా అవార్డుల పేరుతో మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నా పరిధిలో ఉన్న అర్హులైన వారికి అందించడంతో పాటు వారికి అవసరమైన అన్ని ఆన్లైన్ సర్టిఫికెట్లను దగ్గరుండి పూర్తి చేయిస్తాను.

– కర్రి జ్యోతిర్మయి, సేవా రత్న అవార్డు గ్రహీత, ఉప్పాడ

సీఎం జగన్కు కృతజ్ఞతలు



గ్రామ వలంటీర్గా ప్రజాసేవ చేసేందుకు నాకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు. ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మమ్మల్ని ప్రజలు గుర్తించడం, మా సేవలు ప్రభుత్వం గుర్తించి అవార్డులకు ఎంపిక చేయడం ఆనందాన్ని ఇస్తున్నాయి. మాకు ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జి.రమేష్, సేవావజ్ర అవార్డు గ్రహీత, నాగులపల్లి

కష్టం వస్తే గుర్తొచ్చేది వలంటీర్లే



ప్రజలకు ఏ కష్టం వచ్చినా మొదటిగా గుర్తుకు వచ్చేది వలంటీరే. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రారంభించి ప్రజల వద్దకే పథకాలు అందిస్తున్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోంది. నాగులపల్లి పంచాయతీ పరిధిలో వలంటీర్గా పని చేస్తున్న నాకు సేవా వజ్ర పురస్కారం దక్కడం ఆనందంగా ఉంది.

– కేపీ రెడ్డి, సేవావజ్ర అవార్డు గ్రహీత, నాగులపల్లి

గుర్రాల సెంటర్ పార్కును అభివృద్ధి చేయండి

- స్పందనలో స్థానిక ప్రజల వినతి
- 16 అర్జీలు స్వీకరించిన ఆర్డీఓ



స్పందనలో ఆర్డీఓకు సమస్య వివరిస్తున్న స్థానికులు

పెద్దాపురం: స్థానిక గుర్రాల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కులోని వాకింగ్ ట్రాక్ అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులు కొందరు సోమవారం స్పందనలో ఆర్డీఓ జేవీఎస్ రామారావుకు వినతి పత్రం అందజేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం చొరవ చూపి పార్కు అభివృద్ధిపై దృష్టి సారించి అసాంఘిక కార్యక్రమాలు సాగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన నిర్వహిస్తున్నామని, డివిజన్లో ఆయా మండలాల నుంచి 16 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ తెలిపారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆయా అర్జీలను సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ వివరించారు. ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, డీఎల్పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైల్వే గేటు మూసివేత

సామర్లకోట: స్థానిక గాంధీ చౌక్ నుంచి కాకినాడ వెళ్లే ఎల్సీ 426 గేటు బుధవారం నుంచి మార్చి ఆరో తేదీ వరకు మూసివేయనున్నట్టు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు బి.రామసుబ్బారావు తెలిపారు. రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతుల వల్ల రాకపోకలు నిషేధించినట్టు తెలిపారు. చిన్న వాహన చోదకులు, రైతులు ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇప్పటికే ఫ్లైఓవర్పై తరుచూ ట్రాఫిక్ స్తంభించి పోతోందని, ఈ రైల్వే గేటు మూసివేత వల్ల ఆ సమస్య పరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ మేరకు ఫ్లైఓవర్పై ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కాకినాడ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ భాగంలోను, కాకినాడ–వేట్లపాలెం కూడలిలో పోలీసు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులకు, లారీ, ఆటో యూనియన్ల నాయకులకు సమాచారం ఇచ్చినట్టు రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు.

నేటి నుంచి కోనసీమ సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శిక్షణ ఉంటుందని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సోమవారం రాత్రి తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇండియన్ స్టాండర్డ్స్ అనే అంశంపై 400 మందికి శిక్షణ ఉంటుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొత్తపల్లి: స్థానిక లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ విగ్రహాన్ని దాత పురంశెట్టి శ్రీను చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి వంగా గీత
- ఏకే మల్లవరంలో పంట పొలాల పరిశీలన



ఏకే మల్లవరంలో రైతులతో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: సాంకేతిక సమస్యల కారణంగా నియోజకవర్గంలో అక్కడక్కడా సాగునీటి ఎద్దడి ఏర్పడినా వెంటనే పరిష్కరించే ఏర్పాట్లు చేశామని, ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా అన్ని చర్యలు తీసుకున్నామని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీత తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఆమె గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో పంట పొలాలను పరిశీలించారు. పంట కాలువ శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ గీత నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట కాలువ నుంచి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి అన్ని ప్రాంతాలకు నీరు అందించేలా చూడాలన్నారు. నీటి పారుదల శాఖ సిబ్బంది సాగునీరు అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు ఆమె సూచించారు. రెండు రోజుల్లో అన్ని పొలాలకు నీరు అందేలా చూస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. ఆమె వెంట జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, అరిగెల మణిబాబు, పలువురు రైతులు ఉన్నారు.

మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి



పిఠాపురంలో ఆర్యూబీల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో రెండు ఆర్యూబీలు ప్రారంభం

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వం నుంచి మునుపెన్నడూ లేనివిధంగా నిధులు తెచ్చి కాకినాడ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేసినట్లు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి వంగా గీత తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ పద్ధతిలో పలు రైల్వే అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటు పిఠాపురంలో రెండు ఆర్యూబీల శిలాఫలకాలను ఆవిష్కరించి ఎంపీ వంగా గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఇటీవల రూ.24 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన పిఠాపురం–ఉప్పాడ రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ నుంచి నిధులు విడుదల చేయించామన్నారు. రైల్వేశాఖ ఇప్పటికే రూ.45 కోట్లు విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి రూ.40 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ పనులు పూర్తి కావచ్చాయన్నారు. మాధవపురం, గోర్స రైల్వే గేట్లు వద్ద ఆర్యూబీలు నిర్మించి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పిఠాపురం రైల్వే స్టేషన్ను అభివృద్ధి చేసినట్లు ఆమె తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రంగా పిఠాపురాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజల సహకారంతో పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్ఆర్యూసీ సభ్యుడు రావుల మాధవరావు, జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల సాయి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, గండేపల్లి బాబీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, బీజేపీ నేతలు గండి కొండలరావు, పసుపులేటి సత్యనారాయణ, బుర్రా కృష్ణంరాజు, రైల్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ సతీష్కుమార్



కొత్తపల్లి మండల మ్యాప్ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్కుమార్

కొత్తపల్లి: గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ను సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఉప్పాడ బీచ్రోడ్డు సెంటర్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్థులను గుర్తించి, వారిని బైండోవర్ చేయాలన్నారు. గ్రామాల్లో ఎంటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై స్వామినాయుడు ఉన్నారు.

4821 ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు

కొత్తపల్లి: మండలంలో ఇప్పటివరకూ 4821 మంది పేదల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పొన్నాడ, ఉప్పాడలోని గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5013 మంది ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయవలసి ఉండగా ఇప్పటివరకూ 4821 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి పట్టాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు.

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి
- 200 మంది టీడీపీ వర్గీయులు పార్టీలో చేరిక



పార్టీలో చేరిన టీడీపీ కుటుంబ సభ్యులతో దవులూరి

పెద్దాపురం: ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలకున్న ప్రజాదారణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతాయని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక 23వ వార్డు వ్యాపారపుంతలోని టీడీపీకి చెందిన సుమారు 50 కుటుంబాల్లోని 200 మంది సోమవారం ఆయన సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నవరత్నాల పేరుతో సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజాభిమానంతో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం తథ్యమని దొరబాబు అన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పిన్నింటి రాము, కాలనీ చెందిన సుమారు 50 కుటుంబాల సభ్యులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, అప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తాడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి..

సామర్లకోట: మండల పరిధిలో చంద్రపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు సోమవారం రాత్రి వైఎస్సార్సీపీలో చేరారు. జనసేన సీనియర్ నాయకుడు తుమ్మల బాబుకు పెద్దాపురం ఎమ్మెల్యే టిక్కెట్టు వస్తుందని కార్యకర్తలు ఆశించారు. అయితే టీడీపీకి ఆ టిక్కెట్టు ఇవ్వడంతో చంద్రపాలెంకు చెందిన 25 మంది సీనియర్ జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. చంద్రపాలెం నుంచి సామర్లకోట వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయానికి వచ్చిన వారికి దవులూరి దొరబాబు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ చంద్రంపాలెం సీనియర్ నాయకులు ఇజ్జిన తేజ మండపాక సురేష్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు.



వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

సంక్షేమ వారధులు వలంటీర్లు

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి
- వేడుకగా సేవా పురస్కారాల ప్రదానం



వలంటీర్లను సత్కరిస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వానికీ, ప్రజలకూ సంక్షేమ వారధులు వలంటీర్లు అని, సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్ల పాత్ర కీలకమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని ఆయా గ్రామాల వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం చేశారు. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దవులూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవా సైనికులు గ్రామ వలంటీర్లు అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను చేరవేయాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అందుకు తగ్గట్టుగానే వలంటీర్లు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటికి అందిస్తూ సైనికుల్లా పనిచేస్తున్నారని అభినందించారు. రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లదే కీలక పాత్ర అన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేసి సత్కరించారు. ఎంపీడీఓ ఉషారాణి, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, జేఏసీ మండల కన్వీనర్ గోపు మురళి, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, పరిమి శ్రీను, గోలి రామారావు, పెంటా విజయ్కుమార్, నల్లల గోవిందు, కపపర్తి చీమదొర, తుమ్మల అచ్యుతరామయ్య, నల్లల నాగేంద్రబాబు, మండల కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

29న పెద్దాపురం మున్సిపల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం 29వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

28న సామర్లకోటలో..

సామర్లకోట: ప్రతి నెలా జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశం 28వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో పట్టణ పరిధిలోని అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో 24 అంశాలను చర్చించనున్నారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.